

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## తస్మాత్ జాగ్రత్త!

**చిన్నప్పుడు రోజులు** ఎంత సాదాసీదాగా గడిచిపోయేవీ. కాలక్షేపం అంటే రేడియో వినడం, లేదా బయటకి వెళ్ళి ఆడుకోవడం. సమాచారం తెలుసుకోడానికి వార్తాపత్రికలు చదవడం, సరదాగా పండగరోజుల్లోనో, చుట్టాలు వస్తేనో సినిమాలకి వెళ్ళడం, పొరుగూరు నుండి మన ఊరుకి ఎవరైనా వస్తే విహార యాత్రలకి తీసుకెళ్ళడం. దగ్గర్లో వున్న తీర్థమో, చరిత్ర కట్టడాలో చూపించడం. ఇంటి దగ్గర చేసుకు తీసుకెళ్ళిన పులిహోరో, పూరీలో తినడం. రైలు ఎక్కి వెళ్ళడం అంటే పుణ్యక్షేత్రాలూ, లేదా వేసవి శెలవలలో దూరదేశంలో వున్న బంధువుల ఇళ్ళకి వెళ్ళడం.

కాలం వుంటే కాలక్షేపం కదా! ఇళ్ళల్లో ఆడవారికి కూర్చోడానికి కాస్త అయినా సమయం చిక్కేది కాదు. బియ్యం, పప్పులూ బాగు చేసుకోవడం, నెలంతా సరిపడా రవ్వలూ, పిండ్లూ విసురుకోడం, ఊరగాయల సీజన్ వస్తే ఊరగాయలూ, పొడులూ, వడియాలు పెట్టుకోడం... పక్క ఇళ్ళల్లో కానీ కాలనీలో కానీ కొత్తవారు ఎవరొచ్చినా తెలిసేది. మొదట పిల్లలు కలసి ఆడుకోడం, పోట్లాడుకోడంతో పెద్దల పరిచయాలు జరిగేవి.

"ఓ పర్వతనేని రామారావుగారా? మా ఇంటి దగ్గరే.. భారతాలావిడా? ఆవిడ మాకు చాలా స్నేహం" అని ఎవరినైనా గుర్తుపట్టి మాట్లాడేవారు. భజగోవింద శ్లోకాలో, సీతమ్మ సమర్తో పాడుకుంటూ వంట చేస్తుంటే ఎంత ఆరాముగా వుండేది. వంట కూడా అంత రుచిగా వుండేది.

ఇంక ఇప్పటి ఫాస్ట్ యుగంలో కొస్తే నాకు కొత్తగా మా కాలనీలో ఇళ్ళు కట్టుకున్న వారెవరూ తెలీదు. కనిపిస్తే చిరునవ్వు నవ్వుకునే పరిస్థితి కూడా లేదు అమెరికాలోలాగా. మా అబ్బాయి ఇంటికి వెళితే ఆ ఫ్లాట్స్‌లో కూడా అంతే. మన గోడ పక్కనున్న ఇంట్లో ఎవరున్నారో తెలీదు. సంఘ విద్రోహ కార్యాలు జరుగుతున్నా, హత్యలు జరుగుతున్నా దోపిడీలు

జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. పిల్లలు కలిసి ఆడుకోడం కన్నా బలవంతపు కరాటే క్లాసులూ, బాట్‌మింటెన్‌లూ, పెయింటింగ్‌లూ గట్రా పెట్టి, తల్లి దండ్రులు వాళ్ళ ఎనర్జీ అంతా ఖర్చు అయ్యాకనే ఇంట్లోకి తీసుకొస్తారు. కేవలం తల్లితండ్రులకి టైమ్ లేకే. పిల్లల్ని వివిధ కోర్స్‌లలో బలవంతంగా పెడ్తున్నారు. చందమామని చూపించి గోరు ముద్దలు తినిపించే అమ్మమ్మలూ, కథలు చెప్తూ నిదురపుచ్చే నాయనమ్మలూ లేరు.

ఒకవేళ ఏ అమ్మమ్మో గోరుముద్దలు తినిపించబోయినా, కోడలో కొడుకో "అలా అలవాటు చెయ్యద్దమ్మా. రేపు స్కూల్లో వాడే తీసుకుని తినాలిగా" అంటారు.

ఇంక వేసవి శెలవల్లో అమ్మమ్మా తాతయ్యల ఊరికి ఎంతమంది వెళ్తున్నారూ? అమ్మమ్మలూ తాతయ్యలూ కూడా బిజీగా వుంటారు వాళ్ళ క్లబ్బులలోనో, కిట్టీపార్టీలలోనో, లేదా ఓల్డ్‌ఏజ్ హోమ్ లలోనో.

"మీ తల్లితండ్రులకి అన్ని సౌకర్యాలతో విశ్రాంతి హోమ్స్" అంటూ ప్రచారం చేస్తున్నారు. విదేశాలలో వున్న పిల్లలు తమ తల్లితండ్రులకి టైముకి మెడికల్ ఎయిడ్ దొరికితే చాలని, వాటిల్లో డబ్బు కట్టి జాయిన్ చేసేస్తున్నారు. ఔను! వంట చేసుకోనక్కర్లేదు. ఈ రోజు మెంతి మజ్జిగ చెయ్యి. రెండు గుమ్మడి వడియాలు వేయించు చాలు" అని భర్త అడగడానికి వుంటుందా?" చిన్నాడు అమెరికా నుండి వస్తున్నాడు వాడికి అరటి ఊచ పెరుగు పచ్చడి అంటే ఇష్టం, చేసి పెడతా.." అనే వీలుంటుందా హోమ్స్ లో. ఇంకా డెబ్బైవ పడిలో పడకముందే, అరవై దాటగానే పిల్లలు, తల్లితండ్రులని ముసలివారుగా, తమ పని తాము చేసుకోలేనివారుగా ఎంచి ఇలాంటి కమ్యూనిటీ హోమ్స్ లో పెట్టేస్తున్నారు. వీటివల్ల బుజ్జి బుజ్జి మనవలు తాతా నానమ్మలతో వేసవి శలవలు గడపలేకపోతున్నారు. తల్లి చేతి వంట పిల్లలు మిస్ అవుతున్నారు.

టీవీలో బొమ్మల కథలే కానీ మాతృభాషలో అమ్మమ్మలు చెప్పే రామాయణ భారతాలు పిల్లలకి తెలీవు.

డైనోసార్స్‌లో ఎన్ని రకాలూ, గ్రహాలెన్నీ, ఏ దేశానికి ఏ కేపిటలూ లాంటివి ఐదో పదో రుద్దేస్తున్నారు కానీ, చిన్నచిన్న బంధుత్వాలు.. నాన్న పిన్ని మనకి అమ్మమ్మ అవుతుందనీ, అమ్మ మేనమామ మనకి తాత అవుతాడనీ, నాన్నా అక్క కొడుకు మనకి బావ వరుస అనీ ఇలాంటివి కూడా 'జెన్ జీ ' కి తెలీడం లేదు. బియ్యం చెట్లూ, సొరకాయ చెట్టూ అంటున్నారు. వారికి వరిపైరూ, సొరపాదూ చూపించే తీరుబడీ, వెసులుబాటూ పెద్దలకి వుంటేగా!

ఇంటిముందు వేపచెట్టు కింద వెన్నెల్లో మంచాలు వేసుకుని పడుకుని అమ్మమ్మ కథలు చెప్తూవుంటే వినే బాల్యం లేదు. తాతయ్య పతంగులు ఎగరేయించడం, మావయ్య బాణాసంచా తెచ్చి దగ్గరుండి కాల్పించడం, నాన్న సైకిల్ నేర్పించడం, అత్తలు అరిశలు వత్తుతుంటే చూడడం... ఇవన్నీ రాను రాను సినిమాలలో కూడా చూపించడం తగ్గిపోతోంది. ఒకప్పుడు పేపర్‌లో న్యూస్‌లొస్తేనో, లేదా పుస్తకాలు చదివితేనో మన విషయ పరిజ్ఞానం పెరిగేది. ఇప్పుడు టీ.వీ. ఆ తర్వాత స్మార్ట్ ఫోన్‌లూ వచ్చాక ఇంట్లో వారితోకన్నా ప్రపంచంతో సంబంధాలు పెరిగాయి.

సోషల్ మీడియాలో వేడిగా వాడిగా జరిగే చర్చలూ, అరచేతిలో సినిమాలూ.. ఇవన్నీ మనిషిని తల ఎత్తి పక్కవాడివైపు చూడనివ్వడం లేదు. ఏ సహాయం కావాలీ అని అడగనివ్వడంలేదు.

పబ్లిక్‌లో కొంత పేరొచ్చాక మాట్లాడితే ట్రోలింగ్ "నా వివాహ జీవితం గురించి చెప్పుకోడానికేం లేదు" అంటే ఓ సెలబ్రిటీ ట్రోలింగ్... "నా వివాహ జీవితం బాగోలేదు" అని ఇంకో సెలబ్రిటీ అన్నా ట్రోలింగే.

"బట్టలు వేసుకోండి నిండుగా" అంటే ట్రోలింగ్.. మా ఇష్టం నువ్వెవరు అనడానికి? అంటూ" నేను నా ఇష్టం వచ్చిన బట్టలు వేసుకుంటాను" అంటే ట్రోలింగ్" అయితే విప్పుకుని తిరుగుతావా? అంటూ.

"ఊ" అంటే ట్రోలింగ్, "ఊహూ" అంటే ట్రోలింగ్. అసలు పనీపాటా లేని వారే ఈ సోషల్ మీడియాలలో ట్వీట్స్ చేసి కయ్యాలకి కాలు దువ్వడం, ఫేస్ బుక్‌లలో స్టేట్‌మెంట్స్ పాస్ చెయ్యడం, ఇన్‌స్టాలో స్వంత జీవితాన్ని నలుగురికీ ఎగ్జిబిట్ చేసి, ఆ తర్వాత ఎవరైనా ఏమైనా అంటే ఏడవడం.. ఇవన్నీ జరుగుతాయి.

ఇంక ఫేస్‌బుక్‌లల్లో దొంగతనాలు, వ్యభిచారం జోరుగా సాగుతోంది. మొగుడు అవసరం అన్నా ఇంటి ఇల్లాలు పోపుల పెట్టెలోంచి దాచుకున్న ఐదువందల నోటు బయటకి తియ్యడానికి సంకోచిస్తుంది కానీ, ఎవరో పరాయి మగాడు మెసెంజర్లో ఆమె సౌందర్యాన్ని మెచ్చుకుంటే 'గూగుల్ పే' ద్వారా ముప్పైవేలు పంపడం, ఆ తర్వాత వాడి ఎఫ్.బి ప్రొఫైలు గల్లంతు అవడం పరిపాటి. జూకర్ బర్గ్‌కి తెలుగు రాకపోవడం వల్ల, ఎఫ్.బి ప్రొఫైల్స్ 'నీ పక్కింటివాడి పెళ్ళాం.. మేనత్త కొడుకునీ, మొదలైన పేర్లు పెట్టుకుంటున్నారు. శనిగ్రహం, నిర్భాగ్యుడూ, పరమ దరిద్రుడూ నించి కూడా నాకు ఫ్రెండ్ రిక్వెస్టులు వస్తూ వుంటాయి. చూస్తూ చూస్తూ ఆ 'పరమదరిద్రుడిని ' ఎలా ఫ్రెండ్ చేసుకుంటాం?

ఇంక పెద్దపెద్ద వాళ్ళు, వయసులో వున్నప్పుడు తీరని కోరికలన్నీ ఎఫ్ బీలో తీర్చుకుంటూ, కురచ బట్టల్లో రీల్స్ చెయ్యడం, శృంగార గీతాలకి ఒళ్ళు విరుచుకుని డాన్స్‌లు చెయ్యడం, పసిపాపలతో 'ఊ...అంటావా? ఊహూ అంటావా?" అని డాన్స్ చేయించి మీడియాకీ ఏ ఐ కీ ఎక్స్‌పోజ్ చెయ్యడం వలన ఏ మార్కెట్‌లో ఏ పిల్ల మొహంతో శృంగార వీడియోలూ, పోర్న్ మెటీరియల్ ఎగుమతి అయిపోతోందో మనకి తెలీదు. మన పసివాళ్ళ భవిష్యత్ మనమే బజార్లో పెట్టడం, మీడియాలో డబ్బుకోసం వ్లాగ్‌లూ, రీల్స్ చేయించడం అంటే.. ప్రతి విప్లవం ఒక మంచి కోసమే కాదు.. పతనం కోసం కూడా. కత్తికి రెండువైపులా పదును. పండు కోసుకోవచ్చూ, పొడిచి చంపచ్చూ. ఏ కొత్త ఇంటిలిజెన్స్ మార్కెట్‌లోకి వచ్చినా, రెండు రకాలుగానూ ఉపయోగం, ప్రమాదం పొంచి వుంటుంది. ఎలా వాడుకుంటాం అనేది మన విజ్ఞతని బట్టి వుంటుంది. తస్మాత్ జాగ్రత్త...

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి


బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు - 3